# తప్పు

## శ్రీమతి న్యాయపతి కమలారాంజి

**ఆ** వస్తువుని చూడగానే నా కళ్ళు మెరిసేయి !

ఆశ్చర్యం... ఆనందం రెండూ కలిగేయి !


ఆరోజు లక్ష్మివారం ! సాయంత్రం సీతమ్మధారలో వున్న బాబాగారి గుడికి వెళ్లేను. అసలే దసరా రోజులు. విపరీతమైన జనం వున్నారు. బాబాగారి దర్శనార్థం జనం క్యూలో కదిలి వెళ్తున్నారు. బయట ఎన్నో కార్లు, స్కూటర్లు, ఆటోలు ఆగి వున్నాయి. సరిగ్గా కోవెల్లోకి అడుగుపెడుతూ ఉంటే కనిపించింది ఆ వస్తువు !

అది వందరూపాయల నోటు ! పచ్చనోటు!

అదేం చిత్రమో అందరూ హడావుడిగా ఆ నోటుమీద కాలేసి తొక్కుకుంటూ వెళ్ళిపోతున్నారు ! ఎవరూ దానివైపే చూడ్డంలేదు. ఎందుచేత ? అది వందరూపాయల నోటు కాదా ? కాకపోవడం ఏమిటి? నా కళ్లకి స్పష్టంగా కనిపిస్తూంటేనూ ! అయితే ఎవరూ వంగి తియ్యరేంటి? మాకెందుకని వూరుకుంటున్నారా? అయ్యో ! మహాలక్ష్మి అంతమంది పాదాలక్రింద నలిగిపోతూంటే నా మనసు చివుక్కుమంది.

వాళ్లెవరూ ఎందుకు తియ్యడం లేదు ?! పరుల సొమ్ము పాములాంటిది అంటారు. అందుకే తియ్యలేదా ! అంటే కోవెలకి వస్తున్న వాళ్లందరూ నిజమైన భక్తులేనా ?! ఎవరూ ఎప్పుడూ ఎలాంటి పాపమూ చెయ్యలేదా ? అంతమంది పుణ్యాత్ముల మధ్యగా నడుస్తూ నాకేంటి ఇలాంటి పాపపు ఆలోచనలు వస్తున్నాయి ? నేను కూడా చూసీ చూడనట్టు వూరుకుంటే పోయింది. ఆ గుడికి రకరకాల వాళ్ళు వస్తున్నారు !

ఆ జనంలో ఎదురింటి పనిమనిషి ముత్యాలు కనిపించింది. అది వున్నంతలో చక్కగా ముస్తాబై పచ్చగా పసుపు రాసుకుని, పెద్దబొట్టు పెట్టుకుని వచ్చింది. నిజం చెప్పాలంటే అలాంటి వాళ్లకే భక్తి ఎక్కువ. వాళ్ళు నలుగురిళ్ళల్లో పాచిపన్లు చేసి కష్టపడి డబ్బు సంపాదిస్తూ తమకున్న ఆ కొద్దిపాటి సంపాదనలోంచీ పదో ఇరవయ్యో తెచ్చుకుని కొబ్బరికాయ, హారతి కర్పూరం, అరటిపళ్లు కొని




దేవుడికి సమర్పించుకుంటున్నారు. ఆ పచ్చనోటు పాపం అలాంటి వాళ్ళది కాదు కదా. వాళ్ళు వందనోటు ఎందుకు తెస్తారు ! ఛ. వాళ్ళదై వుండదు. పాపం ఏ ముసలామెదో అయి వుంటుంది. ఏ చీరకొంగునో కట్టుకుంటే జారిపోయి వుంటుంది. ఛ. అలా అయివుండదు. పొరపాటున పడిపోతే ఏ కొబ్బరికాయల దుకాణం దగ్గరో, చెప్పులు విప్పే స్థలం దగ్గరో పడిపోయి వుండాలి ! కాని సరిగ్గా కోవెల్లో ఎంటర్ అయే చోట !

సరే ఎలా పడిపోయింది ! ఎప్పుడు పడిపోయింది ! ఎవరిది పడిపోయింది అన్నది కాదు ఇప్పుడు నాక్కావలసింది. ఆ నోటు సంగతి ఎవరూ పట్టించుకోకుండా వెళ్ళిపోవడం అన్నది నాకు అంతుపట్టని సమస్య అయిపోయింది ! దేవుడి గుడికి వచ్చి దేవుడి గురించి ఆలోచించకుండా ఆ నోటు గురించి ఆలోచిస్తున్నానేమిటి నా పిచ్చికాకపోతే ! నేను తప్పు చేస్తున్నానా ? అందరూ చూసీ చూడనట్టు వెళ్ళిపోతున్నట్టే నేను కూడా వెళ్ళిపోదామని ఆ నోటుని దాటి నాలుగు అడుగులు ముందుకు వేసాను, వెనక్కి తిరిగి చూసేను, ఆనోటు ఇంకా అక్కడే వుంది.

"నన్నెవరూ పట్టించుకోరేంటి?" అని దీనంగా అడుగుతున్నట్టనిపించింది. వెంటనే వెళ్ళి ఆ నోటుని గబుక్కున చేతిలోకి తీసుకున్నాను, అలా తీసుకుంటున్నప్పుడు నా చేతులు వణికేయి. గుండె దడదడలాడింది. నేను ఆనోటు తియ్యడం చూసి ఎవరైనా అరుస్తారేమో భయం ! ఆ ఎందుకు కరుస్తారు? నా నోటే పడిపోతే తీసుకున్నాననుకోవచ్చు కదా. ఆ నోటు ఎప్పటికైనా ఎవరో ఒకరు తియ్యక తప్పదు. నేను తియ్యకపోతే అది ఏ తాగుబోతు చేతిలోకో వెళ్ళి వుంటే అతను రెండు పెగ్‌లు లాగించేసి ఖుషీ చేసుకుంటాడు ! ఏ కాలేజి కుర్రాడి చేతిలోనో పడిందనుకుందాం. ఆ నోటు తీసుకుని ఫ్రెండ్స్‌తో ఏ బూతు సినిమాకో చెక్కేస్తాడు. అది ఎవరి చేతిలో పడితే ఎలా ఖర్చవుతుందన్నది రకరకాలుగా ఆలోచించేను. ప్రస్తుతం ఆ నోటు నా చేతికొచ్చింది ! నా చేతిలోని ఆ నోటు చాలా బరువుగా వున్నట్టు అనిపించింది. ఫ్యాన్లు తిరుగుతున్నా ముచ్చెమటలు పోస్తున్నాయి.... భయం వల్ల ! ఎవరూ చేయని "తప్పు" నేనెందుకు చేసేను ? అసలు నేను చేసింది తప్పేనా ?! పరుల వస్తువుని మనం తీసుకోవడం తప్పే ! అదీనూ పవిత్రమైన బాబాగారి దేవాలయంలో ! కొంపతీసి ఆ నోటుని ఎవరైనా తమవాళ్ళకి దిష్టి తీసేసి, అది ఎవరు తీసుకుంటే వాళ్ళకి ఆ దిష్టి కొడ్తుందని నలుగురూ నడిచే చోట పడేయలేదు కదా. అమ్మో ! ఎలాగిప్పుడు ? ఏం చెయ్యడం ?

పోనీ ఆ నోటుని బయట కూర్చున్న ఏ ముష్టివాడికో దానం చేసేస్తే అన్నఆలోచన వచ్చింది. ఛ, అదీ బాగులేదు. ఒకరికి వేస్తే అందరూ చుట్టూ చేరతారు. పోనీ ఆ నోటుని అందరూ సమానంగా పంచుకోండని చెప్దామంటే వాళ్లు సరిగ్గా పంచుకుంటారో లేదో ? అనవసరంగా ఆ నోటు కారణంగా వాళ్ళల్లో వాళ్ళు దెబ్బలాడుకుంటారేమో ? ఎందుకొచ్చిన గొడవ ! మరేం చెయ్యడం ? పోనీ బాబాగారి భక్తి పుస్తకాలు వందరూపాయలకి కొని అందరికీ పంచేస్తే ?! ప్చ్. అది కూడా అంత సులభం కాదు. నేను ఏదో స్వలాభాన్ని ఆశించి అలా పంచిపెడుతున్నాననుకుని ఆ పుస్తకాలు తీసుకోకపోతే ?! పెద్ద చిక్కే వచ్చి పడింది !

"అసలు ఆ నోటుని నేనెందుకు తియ్యాలి?" నన్ను నేను తిట్టుకున్నాను కొంతసేపు. పోనీ ఎక్కడ్నుంచీ తీసేనో అక్కడే తిరిగి పెట్టేస్తే ?!... అందరూ నన్ను పిచ్చిదాన్ని చూసినట్టు చూస్తారు ! ఏం చెయ్యడం ? అలా ఆలోచిస్తూనే క్యూతో పాటు ముందుకు సాగుతూ సరిగ్గా బాబాగారి హుండీ దగ్గరకు చేరుకున్నాను. సడన్‌గా ఫ్లాష్‌లా ఒక ఆలోచన వచ్చింది. వెంటనే పచ్చనోటు తీసి హుండీలో వేసే సాను. అప్పుడు నాకు చాలా హాయిగా అనిపించింది! ఆ నోటు ఎవరిదైతేనేం అది తప్పకుండా దైవకార్యానికి వుపయోగపడుతుందన్న నమ్మకంతో బాబాగారి దర్శనం చేసుకుని తేలికపడ్డ మనసుతోఇంటికి చేరుకున్నాను.

మర్నాడు ఎదురింటి ఆంటీ వచ్చింది. రాగానే మొదలుపెట్టింది.

"మా పనిమనిషి ముత్యాలుంది చూసేవూ. అది మహా మాయలాడి ! నిన్న ఏం చేసిందో తెలుసా! గుడికి వెళ్తానని, రోజంతా ఉపవాసం వుంటానని చెప్పి వందరూపాయలు అడ్వాన్సు అడిగి తీసు కెళ్లింది. తీరా ఇప్పుడేమో ఆ వందనోటు పోయిందం టున్నది ! వుత్తినే. వెధవ్వేషాలు ! ఈ కాలం పని మనుషులు పనిలో చేరిందగ్గర్నుంచి అడ్వాన్సులు కావాలని పీక్కుతింటారు !...."

నా గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టు అనిపించి చాలా గిల్టీగా ఫీలయ్యాను, నన్ను ముత్యాలు చూడలేదు కాబట్టి సరిపోయింది. నా కారణంగా ముత్యాలు మాటలు పడింది. ముత్యాలు తన పని పూర్తి చేసుకుని ఇంటికెళ్ళిపోతూంటే నేను వందనోటు తెచ్చి దాని చేతిలో పెట్టాను. "ఉంచు. ఖర్చుకి పనికొస్తుంది" అన్నాను. ముత్యాలు నావైపు కృతజ్ఞతగా చూస్తూ "మీరు శానా మంచోరమ్మగారూ! ఈ డబ్బు తర్వాతిచ్చేస్తాను" అంది. "వద్దులే. అక్కర్లేదు. వూరికే యిచ్చేను" అన్నాను. అది నా కళ్ళమీద పడి పోయింది. ఆ క్షణంలో ఎంతో మంచి పని చేసానన్న ఎనలేని తృప్తి నాకు కలిగింది !!

## పౌరాణికుడు

పొద్దు పొద్దున్నే
గోదావరి అలల గలగలలు
గుండె కొండను మురిపాల నురగల్తో స్పర్శించాయి
ప్రవహించటం
బహుశా నదికి మాత్రమే తెలుసు

ఎక్కడ నాసిక్ ఎక్కడ బంగాళాఖాతం
చిన్నప్పుడెప్పుడో
అమ్మమ్మ చెప్పిన చిన్న చిన్న కథలు విని
చినుకు దారాల్తో కాల్వలుగా పారి
వాగై నదియై సముద్ర పురాణం చెప్తుంది

కన్నెపిల్లల కాల్వలన్నీ
యువతుల వాగులన్నీ
వయ్యారంగా కలవటం వల్లనే
ప్రౌఢనది గజగమనంగా నడయాడుతుంది.

పక్కనే ఈ నేల ఇలా ఉండాలనీ
ఈ రంగు ఇలా విస్తరించాలనీ
కోరుకునేది ఇష్టపడేది ఈ నదినే –
వందల కిలోమీటర్లు ఎటు చూసినా
పచ్చని తివాచీ మీద పచార్ల పరంపర

చేనుగా మొలిచిన నేలను చూస్తుంటే
జింకలు గంతులేస్తున్నట్టు
నెమళ్ళు నాట్యం చేస్తున్నట్టు
పరిసరాలను మైమరచిన యవ్వనపు జంట
ప్రేమ సామ్రాజ్యం పరిపాలిస్తున్నట్టు
సాక్షీభూతమై నిలిచింది నది.

బస్సులు చెట్లను చీల్చినట్టు
నేలను చీల్చుకుంటూ పోతుంది
నది నవనవలాడుతున్నప్పుడు
ఈ తరాని వానికైనా దూకాలనిపిస్తుంది

నది విశాలం కొవ్వూరు రాజమండ్రిల మధ్య చూడాలి
ప్రబంధాలు కళ్ళల్లో తిరుగుతాయి
గోదావరి అక్కడ
అలానే ఆగితే బాగుండుననిపిస్తుంది

దూరం నుండి చూస్తే ఆగినట్టే ఉంటుంది
దగ్గరగా వెళ్తే నడుస్తున్నట్టుంటుంది
పట్టుకోవాలని చూస్తే పులిలా
చెంగలించి దూకుతుంది

అక్కడెక్కడో అప్పుడెప్పుడో
చిన్న పదంతో పరిచయమై
భావాల అనుభవాల తీగెలు అల్లుకుని
పర్వాలు పర్వాలుగా పూసి
మానవేతిహాస మహాభారతమైంది

తారంగం తిప్పినట్టు
చేతులు తిప్పటం కాదు
చిందులేసే శివతాండవం చేస్తుంది ఈ నది
నేలకు దిగిన మేఘం ఈ నది
పాకీ పాకీ సముద్రాన్ని ఆకాశం చేసింది
రాత్రింబవళ్ళు
మిణుకు మిణుకు మంటున్నాయి చుక్కల అలలు
సముద్రమంతా ఎటు చూసినా వెన్నెలల నురగ

– కందుకూరి శ్రీరాములు